క్లుప్తంగా

పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తాం



పుస్తకాలు చూపిస్తున్న చైర్మన్ అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్‌రూరల్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో జీపీ భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, గ్రామస్తులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్, కార్యదర్శి లచ్చయ్య, నాయకులు దీకొండ శ్రీనివాస్, కల్లెపల్లి జానీ, పులి వెంకటేశం, లక్ష్మణ్, ఉన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

రామగుండం: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, క్రమశిక్షణ కలిగి ఏకాగ్రతతో చదువుకోవాలని రామగుండం ఎస్సై గుండేటి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, సెల్‌ఫోన్ మెసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మహిళల రక్షణకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీటీం విధుల నిర్వహణపై సంపూర్ణ అవగాహన కల్పించారు. డయల్ 100 నంబర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

దీక్షా దివస్ విజయవంతం చేయాలి

ధర్మారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళలు, ప్రజలు హాజరు కావాలన్నారు. అనంతరం వాంకిడి గురుకుల పాఠశాల విద్యార్థి శైలజ మృతిపై విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మిట్ట తిరుపతి, నాయకులు తుమ్మల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, వేణు, వెంకటస్వామి, దేవి నళినికాంత్, ఆవుల లత, మోహన్, కాంపెల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రామగుండం: ఇటీవల ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రామగుండంకు చెందిన సుదమల్ల హర్షవర్ధన్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 9న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు హర్షవర్ధన్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హర్షవర్ధన్‌ను విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ మాస్టర్ వడ్డెపల్లి సురేశ్, కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తగరపు శంకర్, ముక్కెర శ్రీనివాస్, చంద్రశేఖర్, రాము తదితరులు మంగళవారం విజేతను అభినందించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు



విజేతలతో పాఠశాల కరస్పాండెంట్

పెద్దపల్లిరూరల్: గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం గాయత్రీ విద్యానికేతన్‌లో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. 5వ అధ్యాయంలోని పోటీలను రాములుగౌడ్, సత్యనారాయణ, శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిసెంబర్ 4న గోదావరిఖనిలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, పీఈటీ స్రవంతి, సంతోష్, ఖాసీం పాల్గొన్నారు.

ధూళికట్టలో కంటి వైద్యశిబిరం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట పంచాయతీ కార్యాలయంలో బుధవారం కరీంనగర్‌కు చెందిన శ్రీహర్ష కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 65మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

• అడిషనల్ కలెక్టర్ వేణు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు

ముత్తారం: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ వేణు ఆదేశించారు. మండలంలోని పారుపల్లి, ముత్తారం సహకార సంఘం ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. తూకంలో తేడా రాకుండా కాంటా త్వరగా అయ్యేలా చూడాలన్నారు. కొనుగోలు అయిన రైతులకు డబ్బులు సకాలంలో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తర్వాత ముత్తారంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సుమన్, వైద్యుడు అమరేందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ భవాని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పీఏసీఎస్ సీఈవో దాసరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి



కాల్వశ్రీరాంపూర్: పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో గంగయ్య సమగ్ర సర్వే ఆన్‌లైన్ కేంద్రాన్ని సందర్శించారు. తప్పులు దొర్లకుండా సర్వే వివరాలు ఆన్‌లైన్ చేయాలని ఆపరేటర్లను ఆదేశించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ భూసమస్యలపై ఆరా తీశారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు వెంట వెంటనే జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే ఆన్‌లైన్ వేగవంతం

ముత్తారం: మండలంలోని సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ కంప్యూటీకరణ వేగంగా జరుగుతుందని ఎంపీడీవో సురేశ్ బుధవారం తెలిపారు. రెండు రోజుల్లో ఆన్‌లైన్ నమోదు పూర్తి చేస్తామన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

సుల్తానాబాద్: ప్రభుత్వం విధించిన గడువులోగా సర్వే ఆన్‌లైన్ పూర్తి చేయాలని డీఎల్‌పీవో వేణు గోపాల్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్వే వివరాల ఆన్‌లైన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీవో సమ్మిరెడ్డి, ఎంపీడీవో సూపరింటెండెంట్ ఫక్రుద్దీన్ ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

గోదావరిఖని: రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టముక్కుల సరేశ్‌రెడ్డి అన్నారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం సమావేశానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీజేపీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాజీపేట శివాజీ, స్టేట్ మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమారపు లావణ్య, నాయకులు పెద్దపల్లి రవీందర్, దాసరి శ్రీనివాస్, మూకిరి రాజు, సులువ లక్ష్మీనరసయ్య, మహవాది రామన్న, జనగామ శివరామకృష్ణ, గోపగాని నవీన్‌గౌడ్, ఆకుల శశికుమార్, జి.మంజుల, వసంత, లక్ష్మి, గంద్ర స్వరూప, మల్లేశ్, బూడిద రమేశ్, సురేశ, చుక్కల రాములు, లింగం నాయక్ పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పాలకుర్తి: మండలంలోని వేంనూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరుని ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 11గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు వైదయతి రామానుజులు ఆధ్వర్యంలోని వేద పండితుల బృందం కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేంనూర్ సమీప గ్రామాలతో పాటు గోదావరిఖని, ఎన్టీపీసీ, పెద్దపల్లి, మంచిర్యాల, ధర్మారం తదితర పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. గ్రామానికి చెందిన నలిమెల తిరుపతి-జ్యోతి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. గురువారం నాగవెల్లి పోలు దండప్రసాదం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

రామగుండం: రామగుండం-రాఘవాపూర్ ప్రధాన రైల్వే లైనులో ఉన్న కుందనపల్లి రైల్వే గేటు (ఎల్‌సీ-49) వద్ద ఫ్లై ఓవర్, భూగర్భ వంతెన నిర్మించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు బుధవారం రైల్వే ప్రజాసంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ ఢిల్లీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ రామగుండం రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వంతెన నిర్మాణ విషయంలో జరుగుతున్న జాప్యం తదితర సాంకేతికపరమైన అంశాలు తెలుసుకున్నట్లు వారు పేర్కొన్నారు. రెండురోజుల్లో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో సేవా అధ్యక్షురాలు అనిత

గోదావరిఖని: ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మహిళలు తమ వ్యాపారాన్ని ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత అన్నారు. స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వృత్తి శిక్షణ కోర్సులను ప్రారంభించార. గతంలో శిక్షణ పొందిన 365మంది మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా మహిళలకు శిక్షణ అందిస్తోందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మద్దీ ఎల్లయ్య, సీఎంవో ప్రతినిధి శ్రావణ్‌కుమార్, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ డి.కిరణ్‌బాబు, సీనియర్ పీవో హన్మంతరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆలయ మండప నిర్మాణానికి భూమిపూజ

జ్యోతినగర్: పురాతన హనుమాన్ దేవాలయానికి మండపం నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి హనుమాన్ ఆలయ మండప నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, గ్రామపెద్దలు చెప్యాల కేశవరావు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ హనుమాన్ గుడి మండపానికి భూమి దానం చేసిన కీర్తిశేషులు చెప్యాల రాంకిషన్ సతీమణి విజయలక్ష్మితో పాటు వారసులకు కృతజ్ఞతలు తెలిపారు. అర్చకులు సంతోష్ శర్మ, వాస్తుశిల్పి నరసయ్య, సింగం మల్లికార్జునగౌడ్, మునిపట్ల రాజు, మడ్డి చంద్రయ్యగౌడ్, రావికంటి నాగన్న పాల్గొన్నారు.

• ఉద్యమకారుల సంక్షేమానికి కృషిచేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్యయాదవ్ కోరారు. పట్టణం నుంచి బుధవారం కరీంనగర్ వరకు నిర్వహించిన మహాపాదయాత్రకు తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

• ప్లాంట్‌హెడ్‌ను కలిసిన కార్మికసంఘం నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి బుధవారం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ప్లాంట్‌హెడ్ చాంబర్‌లో కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌తో కలిసిన కౌశికహరి ఇటీవల చేపట్టిన సమ్మె నేపథ్యంలో ఇచ్చిన హామీ ప్రకారం నిర్ణీత గడువులోగా కార్మికులకు బోనస్ చెల్లించేలా ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. పర్మినెంట్ కార్మికులు కూడా తమతో కలిసి రావాలని, ఈవిషయంలో కార్మికసంఘం నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని పర్మినెంట్ కార్మికులను కోరారు. నాయకులు పెరుమాండ్ల రమేశ్, బత్తిని సతీశ్, వేల్పుల సంపత్, ముల్కనూరి శ్రీధర్, వెంకటేశ్, ప్రసాద్, సాదిక్ పాల్గొన్నారు.

• నిరుపేదకు బియ్యం అందజేత

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ అనుబంధ గ్రామం నిమ్మపల్లికి చెందిన నిరుపేద కట్ట హనుమమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఎన్‌ఆర్ఐ కోలుముల దామోదర్ స్పందించి కొలుముల ఫౌండేషన్ ద్వారా 50కిలోల బియ్యాన్ని మృతురాలి భర్త కట్ట నర్సయ్యకు అందజేశారు. కొలుముల ఫౌండేషన్ సభ్యులు కొమ్మ రాజేశం, జక్కని మల్లేశం, కూసి రాజయ్య, సాయి, తిరుపతి, గనవేని నర్సింగం ఉన్నారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. పొత్కపల్లి మీదుగా సుల్తానాబాద్, జమ్మికుంటకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేని వాహనదారులకు జరిమానా విధించారు.

• కంటి శస్త్రచికిత్స కోసం తరలింపు

ఓదెల: ఉచితకంటి శస్త్రచికిత్స కోసం ఓదెల గ్రామంలోని 21మందిని బుధవారం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు హాస్పిటల్‌కు తరలించినట్లు ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ తెలిపారు. తరలివెళ్లిన వారికి ఉచితంగా భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. నేత్రవైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్, డాక్టర్లు అనురాగ్ పవార్, శుభం, గీతాంజలీ కరస్పాండెంట్ పల్కపాటి రాజేశ్‌కుమార్ ఉన్నారు.

• శ్మశాన వాటికకు మరమ్మతు

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల శ్మశాన వాటికకు బుధవారం మరమ్మతు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్, క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య మాట్లాడారు. శ్మశాన వాటికలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లను, తుంగను ఎర్రబెల్లి సుధీర్‌రావు సహకారంతో జేసీబీతో తొలగించామని తెలిపారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ జూలూరి అశోక్, కార్యదర్శి పిట్టల వెంకన్న, కోశాధికారి పూసాల సాంబమూర్తి, ఎర్రబెల్లి సుధీర్‌రావు, సతీశ్, నరేందర్, హర్ష, సతీశ్ పాల్గొన్నారు.

• ముదిరాజ్ సొసైటీలో అక్రమాలు జరగలేదు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల ముదిరాజ్ సొసైటీలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు కొందరు ముదిరాజ్ కులస్తుల ఆరోపణలను ఆ సొసైటీ అధ్యక్షుడు దాసరి మల్లేశ్ ఖండించారు. నిర్మాణంలో ఉన్న స్థానిక పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొసైటీపై తప్పుడు ప్రకటనలు చేయడం శోచనీయమని, ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కందుల మల్లేశ్, కార్యదర్శి బండి రవి, సభ్యులు పాల్గొన్నారు.

• బీమా ఏజెంట్‌కు సన్మానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎల్ఐసీ ఆఫీసులో బుధవారం నిర్వహించిన సమావేశంలో సుల్తానాబాద్‌కు చెందిన అమిరిశెట్టి తిరుపతి అనే ఏజెంట్‌ను బ్రాంచ్ మేనేజర్ ప్రేంసాగర్‌రెడ్డి సన్మానించారు.

క్రైం కార్నర్

కారును ఢీకొన్న లారీ

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల స్టేజీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఫోర్‌లైన్ రహదారిపై బుధవారం లారీ కారును ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా వైపు కర్రల లోడ్‌తో వెళ్తున్న లారీ మార్గమధ్యంలో కన్నాల స్టేజీ వద్దకు చేరుకోగా లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొన్నది. దీంతో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగి డివైడర్‌ను ఢీకొంది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచింది. విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా సిబ్బంది సాయంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు.

నగరపాలక సంస్థ చెత్త ట్రాలీ దగ్ధం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్ ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ చెత్త తరలించే వాహనంలో మంటలు చెలరేగి పూర్తిగా మంటల్లో కాలిపోయింది. రామగుండం నగరపాలక సంస్థ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రావు ఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని పరిశీలించారు. షాట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధమైందని ఆయన తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి సహకరించండి

రామగిరి: ఆర్జీ-3 ఏరియాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని నూతన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎండీ.యూనస్‌ను ఆర్జీ-3 పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన లేబర్ కమీషనర్‌ను రామగుండంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, సీనియర్ పర్సనల్ అధికారి పి.రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం

ఓదెల: మండలంలోని మడకలో ఎమ్మెల్యే విజయరమణారావు మంజూరు చేసిన రూ.లక్ష నిధులతో మంచినీటి పైపులైను పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేంసాగర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పేరవేన రవి, నాయకులు మ్యాడగోని మల్లేశంగౌడ్, రమేశ్, తూడి సంపత్, బోగె రాజు, పూదరి కుమార్ పాల్గొన్నారు.



జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ప్రధాన రహదారిపైనే మురుగు నీరు పారుతోంది. పైపులు తీసుకొచ్చి ఆరునెలలు గడుస్తున్నా వేయక పోవడంతో పక్కనే ఉన్న బస్టాప్‌లో బస్సు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పైపులు వేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కార్మికుల సొంతింటి కల నిజం చేయాలి

గోదావరిఖని: ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా మొదటిసారి నిర్వహించే స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికుల సొంతింటి కల నిజం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి బుధవారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణిలో 2023 డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిందని, ఇప్పటివరకు హామీ ఇచ్చిన డిమాండ్లను అమలు చేయలేదని ఆరోపించారు. యాజమాన్యంతో గురువారం జరిగే స్ట్రక్చరల్ సమావేశంలో పలు డిమాండ్లు నెరవేర్చేలా యాజమాన్యంతో ఒప్పందం చేసుకోవాలన్నారు. సొంతింటి పథకం కింద 250గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇప్పించాలని కోరారు. మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, ప్లేడే పీహెచ్‌డీల్లో ఎస్1 విధానం తీయించాలన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు పైరవీలు లేకుండా ఇన్వాలిడేషన్ అమలు చేయాలన్నారు. పెండింగ్ అలవెన్స్‌లు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు ప్రత్యేక లీవులు ఇప్పించాలని, ముఖ్యంగా కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు.

యంత్రాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి



నూతన యంత్రం వద్ద జీఎం కె.వెంకటేశ్వర్లు, అధికారులు

రామగిరి: యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. ఏపీఏ గని ఆవరణలో నూతనంగా కొనుగోలు చేసిన జీసీఎల్ 215కి చెందిన ఎస్‌బీఎల్(డీజిల్) యంత్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, మేనేజర్ జనార్దన్, ప్రాజెక్టు ఇంజనీర్ రఘురాం, అధికారులు బాలరాజు, వేణుకుమార్, రవిచంద్ర, గుర్తింపు, ప్రాతినిధ్య పిట్ సెక్రటరీలు గంగాధర్, కొమురయ్య పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం



వనభోజనంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

రామగిరి: కార్తీక మాసం సందర్భంగా బుధవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలోని మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జీఎం కార్యాలయ ఆఆవరణంలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. పిల్లలు, పెద్దలు కలిసి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. మహిళా ఉద్యోగులు బెల్లం జ్యోతి, మల్లిక, రమ్య, సౌమ్య, శ్వేత, లావణ్య, వేదశ్రీ పాల్గొన్నారు.

అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి: ఏపీఏ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కోరెం జనార్దన్ ఇటీవల డీజీఎంగా పదోన్నతి పొందారు. కాగా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కందికట్ల సమ్మయ్య, జాయింట్ సెక్రటరీ రవికుమార్, బ్రాంచ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కిరణ్‌కుమార్, పిట్ సెక్రటరీ గంగాధర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కుమార్, మైన్స్ కమిటీ సభ్యులు రవీందర్ రాథోడ్, శరత్, రవి కుమార్ పాల్గొన్నారు.

రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభం



రోడ్డును చదును చేయిస్తున్న పోలీసులు

రామగుండం: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయానికి వెళ్లే మార్గమధ్యంలో ముస్లిం కబ్రస్థాన్ సమీపంలో రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈరోడ్డు గుండా సాంఘిక సంక్షేమ గురుకుల, ఐటీఐ విద్యార్థులతో పాటు వారి పేరెంట్స్, రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండు మండలాల ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ముందస్తుగా ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించి రామగుండం, అంతర్గాం ఎస్సైలు గుండేటి సంధ్యారాణి, బోయ వెంకటస్వామి బుధవారం రహదారి పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే అంతర్గాం మండల కేంద్రానికి చెందిన మడ్డి తిరుపతిగౌడ్ పలుమార్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు రహదారి నిర్మాణానికి మోక్షం కలిగింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సుల్తానాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాజీవ్ రహదారిపై వాహనదారులు హెల్మెట్ ధరించాలని శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం రహదారిపై వెళ్తున్న వాహనదారులకు విద్యార్థులు గులాబీ పువ్వులు అందించి హెల్మెట్ ధరించాలని కోరారు. శ్రీచైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ మమత, సిబ్బంది పాల్గొన్నారు.